సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం ¦ 24 ¦ జనవరి ¦ 2025



వణికిస్తున్న చలి

చలి పంజా విసురుతోంది. ఉదయం 8 గంటల వరకు మంచుకురుస్తోంది.చలిని తట్టుకునేందుకు ప్రజలు చలిమంటలు వేస్తున్నారు.

-IIలో



కోర్టు ఆదేశాలు బే ఖాతర్

కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ కూటమి నాయకులకు జీ హుజూర్ అంటూ అధికారులు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు.

-IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.190
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 75 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

25న జాబ్‌మేళా

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధికల్పన కార్యాలయం ఆధ్వర్యంలో జనవరి 25న మదనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజ్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఓబులేషు తెలిపారు. గురువారం కళాశాల విడుదల చేసిన పత్రికా ప్రకటనలో...ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకుని 18 నుంచి 30 ఏళ్ల వయస్సుకలిగిన యువతీ యువకులు హాజరుకావచ్చన్నారు. జనవరి 25, ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. పూర్తి వివరాలకు 9553202509 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

హాకీ బాలికల సబ్ జూనియర్స్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో గురువారం అన్నమయ్య హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా హాకీ బాలికల సబ్ జూనియర్స్ జట్టు ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన వారు ఈనెల 27 నుంచి అనంతపురం ఆర్డీటీలో జరిగే రాష్ట్ర స్థాయి బాలికల సబ్ జూనియర్స్ హాకీ పోటీల్లో పాల్గొంటారని అన్నమయ్య హాకీ కోశాధికారి పి.ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ హితేష్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు జలజ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో జాబ్‌మేళా

రాయచోటి టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), సీడాప్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు రాయచోటి పాలిటెక్నికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం రాయచోటిలో జాబ్ మేళా నిర్వహించారు. అపోలో ఫార్మసీ, ఫ్లిప్ కార్ట్‌లకు చెందిన కంపెనీ ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. 50 మంది ఇంటర్వ్యూకు హాజరుకాగా 14 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఉద్యోగనియామక పత్రాలు ఇచ్చారు. స్కిల్ డెవలెప్‌మెంట్ ప్లేస్మెంట్ అధికారి వెంకటేష్, గణేష్ నాయక్, పెంచలయ్యలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె: పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా కోఆర్డినేటర్ నవీన్ తెలిపారు. గురువారం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాలు పెంపొందించి, ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో...పీఎం ఇంటర్న్‌షిప్ పథకం కోసం ప్రభుత్వం 500 కంపెనీలతో ఒప్పందం చేసుకుందన్నారు. ఇంటర్న్‌షిప్ వ్యవధి 12 నెలలు కాగా, వన్‌టైమ్ గ్రాంట్ కింద రూ.6వేలు, ప్రతినెలా రూ.5వేల చొప్పున ఇస్తారన్నారు. 21 నుంచి 24 మధ్య వయస్సు కలిగి ఎస్ఎస్‌సీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ డిగ్రీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన కింద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 25వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు. వివరాలకు 9553202509 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సై అంటే సై!

- తెలుగు తమ్ముళ్ల మధ్య తారాస్థాయికి విబేధాలు
- అగ్రనేతలు మొదలుకొని క్యాడర్‌లోనూ అదే పరిస్థితి
- ఇటీవల అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో తోపులాటలు
- తంబళ్లపల్లె నియోజకవర్గంలో బ్యానర్లు చించి, కేకులు ధ్వంసం



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్‌లో ఆర్థిక యుద్ధాలు మొదలయ్యాయి. ఎక్కడికక్కడ..ఎవరికి వారు ఆధిపత్యం కోసం కాలు దువ్వుతున్నారు. ఆది నుంచి అధికార పార్టీలో కుమ్మలాటలు కొనసాగుతున్నాయి. అయితే ప్రధానంగా నియోజకవర్గాల్లో పెత్తనం చెలాయించేందుకు కీలక నేతలు కూడా పోటీ పడుతున్నారు. అధిష్టానం మాత్రం ఇంతవరకు ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలనుకూడా ప్రకటించలేని పరిస్థితి కొనసాగుతుండగా..తమ్ముళ్ల మధ్య తగువులాటలు యదా రాజా...తథా ప్రజా అన్నట్లుగా జరుగుతున్నాయి. సంపాదించుకోవడంతోపాటు ఆధిపత్యం విషయంలో వర్గాల మధ్య తీవ్ర స్థాయి పోటీ నెలకొనడంతో నువ్వా, నేనా అన్న పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని నియోజకవర్గాల్లోని టీడీపీ శ్రేణుల మధ్య వర్గాలు ఏర్పడి చివరకు సై అంటే...సైసై అంటూ కాలు దువ్వుతున్నారు.

రాజంపేటలో పచ్చగడ్డివేస్తే భగ్గుమనేలా..

అన్నమయ్య జిల్లా రాజంపేట టీడీపీలో వర్గ విబేధాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఒకవైపు జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మరోవైపు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన సుగవాసి బాలసుబ్రమణ్యం వర్గాల మధ్య పోటాపోటీ పరిస్థితులు నెలకొన్నాయి. గత ఆగస్టులో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవ సందర్భంగా రిబ్బన్ కత్తిరించే విషయంలో కీలక నేతలైన జగన్‌మోహన్‌రాజు, బాలసుబ్రమణ్యంలు తోసుకోవడంతో క్యాకర్తలు విస్తుపోయారు. ఎక్కడికక్కడ శ్రేణులు కూడా గ్రూపులుగా ఏర్పడ్డాయి. ఒక వర్గం అంటే మరొక వర్గానికి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇటీవల ఒంటిమిట్టలో జరిగిన రెవెన్యూ సదస్సులో రెండు వర్గాల మధ్య వాగ్వాదాలు, బహిరంగ సవాళ్లు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం పార్టీకార్యక్రమమైనా, అధికారిక కార్యక్రమమైనా ఒక వర్గం పాల్గొంటున్నా మరొకవర్గం అలజడులు రేపుతోంది. రాజంపేట నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటికీ ఇన్‌ఛార్జిని టీడీపీ ప్రకటించలేక పోతోంది.

తంబళ్లపల్లెలో ముదిరిన వర్గపోరు

జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో నేతల మధ్య వర్గపోరు ముదిరింది. ప్రధానంగా అధికారుల బదిలీలు మొదలుకొని వర్గాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం అధికమైంది. ఇక్కడ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేసిన జయచంద్రారెడ్డి,మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ వర్గీయుల మధ్య విబేధాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు వెళ్లి తమకంటే తమకే ఇన్‌చార్జి పదవి కట్టబెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఆయన తనయుడు లోకేష్‌ను కలిసి విన్నవించారు. అయినప్పటికీ అధిష్టానం ఆ దిశగా అడుగులు వేయకపోగా, ప్రతిసారి వర్గ పోరు తలనొప్పిగా మారుతోంది. తాజాగా ములకలచెరువు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట ప్రాంతాల్లో వర్గాల మధ్యంయుద్ధ వాతావరణం నెలకొని మంత్రి లోకేష్ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఎక్కడికక్కడ ఒక వర్గం చింపివేసి కేకులను విసిరి కొట్టారు. లోకేష్ జన్మ దినం సందర్భంగా రెండు వర్గాల మధ్య ముష్టి యుద్ధం చోటుచేసుకుంది.

రాయచోటిలోనూ ఇంతే..

జిల్లా కేంద్రమైన రాయచోటిలోనూ కిందిస్థాయి క్యాడర్‌లో అసమ్మతితోపాటు వర్గ విబేధాలు కొనసాగుతున్నాయి. మూడు రోజుల కిందట లక్కిరెడ్డిపల్లెలో టీడీపీలోని రెండు వర్గాల వారు దాడులు చేసుకున్నారు. సంక్రాంతికి ముందు కూడా రాయచోటిలోని గునికుంట్ల రోడ్డు చివరన ఉన్న చెరువుకట్టవద్ద ఇరు వర్గాలు రాడ్లతో కొట్టుకోగా, మళ్లీ ఆ రెండు వర్గాల మధ్య జగదాంబ సెంటర్ వీధిలోనూ గొడవ జరిగి ఒక టాటూ సెంటర్‌కు నిప్పు పెట్టారు. ఇలా రాయచోటిలో కార్యకర్తలు, నేతల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఇటీవల పది రోజుల వ్యవధిలో రాయచోటిలో సుగవాసి వర్గీయుల బ్యానర్‌ను మంత్రి వర్గీయులు తొలగించగా.. మంత్రి అనుచరులు ఏర్పాటుచేసిన బ్యానర్‌ను సుగవాసి వర్గానికి చెందినవారు చించివేశారు. ఈనేపథ్యంలో మంత్రి అనుచరులు పోలీస్ స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేయడం కాక రేపుతోంది.

రైల్వేకోడూరులో పెరిగిన గ్రూపులు..

రైల్వేకోడూరు నియోజకవర్గంలో అధికారులకు తంటాలు ఎక్కువయ్యాయి. కార్యకర్తల మధ్య కూడా గ్రూపులు పెరిగిపోయాయి. స్థానికంగా జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఉన్నప్పటికీ పెత్తనమంతా అధికార పార్టీకి చెందిన రూపానందరెడ్డి కుటుంబానిదేనని జగమెరిగిన సత్యం. అక్కడ అంతా కుటుంబ పాలనే కొనసాగుతోంది. టీడీపీ మాజీ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు వర్గంతోపాటు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు వర్గం జనసేన నేతలకు కూడా సరిపోవడం లేదు. దీంతో ఎవరికి వారుగా వర్గాలుగా విడిపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. అధికారులకు కూడా ఒక వర్గం ఒక పని చేయాలని చెబితే....మరొక వర్గం అది చేయవద్దని హుకుం జారీ చేస్తుండటం గమనార్హం. అక్కడ కూడా వర్గాల మధ్య లోలోపల అంతర్యుద్ధం కొనసాగుతోంది. అయితే అధికార పార్టీలో ఉన్న రూపానందరెడ్డి కుటుంబీకులు చెప్పిన పనులే జరుగుతుండడం పార్టీలో ఇతర వర్గాలకు ఎంత మాత్రం రుచించడం లేదు. మదనపల్లెలోనూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషకు వ్యతిరేకంగా కొన్ని వర్గాలు బయటపడకుండా లోలోపల వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఇలా జిల్లా అంతటా టీడీపీలో వర్గ విబేధాలు కొనసాగుతూ నేతలు, కార్యకర్తలతోపాటు అధికారులకు తలనొప్పిగా మారాయని పలువురు పేర్కొంటున్నారు.

11న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

- జిల్లాలోని ఆరు డిపోల నుంచి బస్సుల ఏర్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్: పౌర్ణమిని పురస్కరించుకుని ఫిబ్రవరి 11న ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులను నడుపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికుల భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ సర్వీసులను పవిత్ర క్షేత్రానికి వెళ్లేవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. భక్తులు తమ టిక్కెట్లనుముందుగా రిజర్వు చేసుకోవాలన్నారు.

- కడప డిపోకు సంబంధించి మధ్యాహ్నం 3 గంటగలకు సూపర్ లగ్జరీ సర్వీసు బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా అరుణాచలం వెళుతుందన్నారు. ఇందులో టిక్కెట్ ధరను రూ. 1072గా ఉంటుందన్నారు.
- బద్వేలు డిపోకు సంబంధించి అల్ట్రాడీలక్స్ సర్వీసు మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళుతుందన్నారు. ఇందులో చార్జీగా రూ. 1176లు.
- మైదుకూరు డిపోకు సంబంధించి సాయంత్రం 6 గంటలకు సూపర్ లగ్జరీ సర్వీసు పోరుమామిళ్లలో బయలుదేరి కడప, కాణిపాకం గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుందన్నారు. ధర రూ. 1209లు.
- ప్రొద్దుటూరు డిపోకు సంబంధించి సాయంత్రం 6 గంటలకు సూపర్‌లగ్జరీ సర్వీసు బయలుదేరి మైదుకూరు,కడప మీదుగా అరుణాచలం వెళుతుందన్నారు. ఇందులో ఛార్జిగా రూ. 1273లు.
- పులివెందుల డిపోకు సంబంధించి ఉదయం 7 గంటలకు అల్ట్రా డీలక్స్ సర్వీసు రాయచోటి పీలేరు మీదుగా అరుణాచలం వెళుతుందన్నారు. ఇందులో టిక్కెట్ ధర రూ. 1183గా నిర్ణయించారన్నారు.
- జమ్మలమడుగు డిపో నుంచి ఉదయం 7.00 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో ఛార్జీగా రూ. 1568 ఉందని వివరించారు.

నిధులు.. నీళ్లపాలు

- శానిటేషన్ పేరిట నిధుల గోల్‌మాల్
- నాయకుల పేరిట రూ.22 లక్షలు ఖర్చు
- కారణం చూపని టీడీపీ సర్పంచ్, ఆమె భర్త
- సమాచార హక్కు చట్టంతో అక్రమాలు వెలుగులోకి..

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం మండలం పోతుపేట పంచాయతీ 1160 మంది ఓటర్లు ఉన్న చిన్న గ్రామం. సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామ పంచాయతీకి నిధుల మంజూరు, ఖర్చు వివరాలను దరఖాస్తుదారుడికి అధికారులు ఇవ్వడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తగా ఏర్పడిన ఈ గ్రామ పంచాయతీకి 2019 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు రూ.27,66,351 లక్షలు మంజూరయ్యాయి. వీటిని వాటర్ వర్క్స్, శానిటేషన్, పైప్‌లైన్, సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, డేటా ఎంట్రీ ఆపరేటర్,సర్పంచ్ జీతాల రూపంలో రూ.22,12,902 ఖర్చు చేసినట్లు చూపించగా ప్రస్తుతం రూ.5,53,449లు గ్రామ పంచాయతీలో నిల్వ ఉన్నాయి. జల్ జీవన్ మిషన్ నిధులతో యంపార్లపల్లి, పిడుంవారిపల్లిలోని రెండు ప్రభుత్వ బోర్లకు కొత్త మోటార్లు అమర్చారు. అయితే పంచాయతీ ఆవిర్భావం నుంచి మంజూరైన నిధులతో కేవలం 200 మీటర్ల లోపు పైప్‌లైన్ పనులు, పోతుపేటలో తాగునీటి ట్యాంకుకు నిచ్చెన ఏర్పాటు అది కూడా పాత బోరు పైపులతో, పోతుపేటలోని ప్రభుత్వ బోరులో లీకేజీ పైపులను వెలికి తీయడం తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. పిడుంవారిపల్లి, చేలూరివాండ్లపల్లి రెండు చోట్లా కలిపి 130 మీటర్ల మేరకు మురికి నీటి కాలువలు ఉన్నాయి. వాటిని శుభ్రపరచిన దాఖలాలే లేవని ప్రజల వాదన. పోతుపేట, యంపార్లపల్లిలో ఒక మీటర్ మురికి కాలువ కూడా లేదు. డ్రైనేజీ వ్యవస్థ లేకున్నా శానిటేషన్ పేరిట రూ. లక్షల నిధులను డ్రా చేసేశారు. పైప్‌లైన్ పనుల పేరిట 13 రోజుల వ్యవధిలోనే రూ.99,800ల చొప్పున రెండు సార్లు నిధులు డ్రా చేయడం, సిమెంట్ రోడ్డు వేయకున్నా రూ.1,31 లక్షలను మెక్కేయడం గమనార్హం. అంతేగాక టీడీపీ మహిళా సర్పంచ్, ఆమె భర్తతోపాటు మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే ఓ వ్యక్తి పేరిట రూ.5 లక్షలకు పైగా నిధులు డ్రా చేసినా ఎందుకు ఖర్చు పెట్టారో అధికారులు కారణాలను కనబరచకపోవడం గమనార్హం. రూ.లక్షల నిధుల దుర్వినియోగంపై ఆడిటింగ్ అధికారుల ధోరణిపై పంచాయతీ ప్రజలు మండి పడుతున్నారు.



పోతుపేటలో డ్రైనేజీ లేక నివాస గృహాల నడుమ దుస్థితి

సమగ్రంగా విచారణ చేపట్టాలి

పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి రూ.27 లక్షల దాకా నిధులు వచ్చినా ఎలాంటి పనులు జరగలేదు. మురికి కాలువలే లేకపోయినా అధికారులు ఉన్నట్టు సృష్టించారు. జిల్లా కలెక్టర్, డీపీవో ఈ విషయంపై సమగ్రంగా విచారణ చేపట్టాలి.

-కేవీ రమణ, ఎస్‌హెచ్ఏఏ ఫీల్డ్ లెవల్ కౌన్సిలర్, పోతుపేట

అభివృద్ధి, సంక్షేమంలో
కూటమి ప్రభుత్వం విఫలం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమం శూన్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. గురువారం రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రభుత్వ పాలనలో రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు మంచి జరగలేదన్న విషయాలను గణాంకాలతో సహా వివరించారు. పాలనను చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదచల్లడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అసెంబ్లీలో టీడీపీకి చెందిన ఎమ్మెల్సీలే రాష్ట్ర వ్యాప్తంగా 2019–2024 మధ్య కాలంలో ఎన్ని ల్యాండ్ గ్రాబింగ్ లు జరిగాయి, ఎన్ని అసైన్ మెంట్ కమిటీలు అక్రమంగా జరిగాయన్న వివరాలను అడిగారన్నారు. ఇందుకు రాయచోటి నియోజక వర్గ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు ఎటువంటి భూ అక్రమాలు జరగలేదని సీసీఎల్ఏ కు పూర్తి నివేదికలు పంపారన్నారు. ఆ నివేదిక ప్రతులను శ్రీకాంత్ రెడ్డి విలేకరులకు చూపించారు.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాయచోటిలో ఒకే చోట 6 వేల మందికి పక్కా గృహాలు మంజూరు చేసి, ఇళ్ల స్థలాలను అందచేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన పక్కా గృహాలు ఎక్కడా లేవన్నారు.
- అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత రాయచోటిలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ భూములను కేటాయించామన్నారు.
- గత ప్రభుత్వంలో తప్పిదాలు జరిగివుంటే బయట పెట్టాలని కూటమి నాయకులకు సవాల్ విసిరారు.
- గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు హోల్ సేల్, రీటైల్, చిల్లర అంగళ్ల వ్యాపారాలు 70 శాతం తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ లేదని వాటి అభివృద్ధికి కృషి చేయాలే కానీ, ప్రతిపక్షంపై అనవసరంగా బురద చల్లొద్దని ఆయన హితవు పలికారు.
- నూతన జిల్లాల ఏర్పాటులో రాయచోటిలోనే అన్ని వసతులతో కూడిన పోలీసు పరేడ్ గ్రౌండ్, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ భవనాలను తక్కువ కాల వ్యవధిలోనే సమకూర్చామన్నారు.
- 15 శాతం జీడీపీని పెంచుతామని చంద్రబాబు నాయుడు చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు.
- రాయచోటి ప్రభుత్వాసుపత్రిలో నలుగురు ఉన్న వైద్యుల స్థానంలో 24 మందిని నియమించడమే కాకుండా వంద పడకల ఆస్పత్రిగా, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం కొత్త నిర్మాణాలపై దృష్టి సారించాలని, కల్లబొల్లి మాటలతో కాలక్షేపం చేయొద్దని శ్రీకాంత్ రెడ్డి కోరారు.
- బనకచర్ల క్రాస్ కు పోలవరం నీళ్లు తెస్తామని చంద్రబాబు నాయుడు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజలను మభ్య పెట్టడానికి చెబుతున్న మాటల్లో ఇది ఒకటి అని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ లో ఏడు నెలలుగా నీళ్లను కిందకు వదిలారన్నారు. కనీస లెవెల్స్‌ను నిర్వహించకుండా, డెడ్ స్టోరేజీలో నీళ్లు లేకుండా తోడేసారన్నారు.శ్రీశైలంలో నీళ్లు ఉంటే కదా రాయలసీమకు మంచి జరిగేది అని అన్నారు. చుక్క నీరు లేకుండా చేసిన బాబుకు రాయలసీమ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు.60 శాతం మేర పూర్తయిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.
- గండికోట ప్రాజెక్ట్‌లో స్టోరేజ్ పెంచి హెచ్ఎన్ఎస్ఎస్ కు లింకేజ్ చేయాలన్నారు.గండికోట నుంచి వెలిగల్లుకు లింక్ అప్ చేసేలా చేపట్టిన పనులను 50, 60 శాతం పూర్తి చేశామన్నారు. దానిని టేక్ ఆఫ్ చేయాలే కానీ, మళ్లీ చిత్రావతి నుంచి తీసుకువస్తామని చెప్పడంలో అర్థం లేదన్నారు.
- వచ్చిన నిధులన్నింటినీ అమరావతికే ఖర్చు చేస్తుండడంతో రాయలసీమ ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయన్నారు. సీమ వాసులను మాట్లాడనీయకుండా ఉండడానికే బనకచర్ల క్రాస్ పేరు చెపుతున్నారే కానీ పూర్తి చేయాలన్న ఉద్దేశం చంద్రబాబుకు లేదన్నారు. మీకు రాయలసీమపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కర్నూలులోనే హైకోర్టు ను కొనసాగించాలన్నారు. రాయలసీమ లోని లిఫ్ట్ ఇరిగేషన్ లను పూర్తి చేసిన తరువాతనే బనకచర్ల క్రాస్ గురించి మాట్లాడాలని ఆయన చంద్రబాబుకు సూచించారు.
- దావోస్ పర్యటనలతో అద్భుతాలు సాధిస్తాం.. ఎన్నో పరిశ్రమలు తెస్తామంటూ చంద్రబాబు గొప్పలు చెప్పడం తప్ప రాష్ట్రానికి ఏమి తీసుకు రాలేదన్నారు. 2018 పర్యటనలో రాష్ట్రానికి 150 సంస్థలు, ఎయిర్ బస్, అలీ బాబా, ప్రకాశం జిల్లాకు జిందాల్, రక్షణ పరికరాల ప్లాంట్ లాక్ హీడ్, హై స్పీడ్ రైళ్ల కర్మాగారం, హైబ్రిడ్ క్లౌడ్ (సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం) వంటివి వస్తున్నాయని చెప్పారన్నారు. అప్పటి నుంచి ఇంకా వస్తూనే ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు. దావోస్ పర్యటనలతో రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్ట్ అయినా వచ్చిందా? అని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రాలో 10 పోర్టులు ఉన్నాయని నిన్న చంద్రబాబు చెప్పారన్నారు. వైఎస్ఆర్ హయాంలో 2, మిగిలినవి జగన్ హయాంలో నిర్మాణాలు చేపట్టారన్నారు. జగన్ హయాంలో 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చారని చెప్పారు. మెడికల్ కళాశాలలు వద్దని లేఖలు రాయడం ద్రోహం కాదా అని ఆయన నిలదీశారు. అమరావతి కోసం లక్ష కోట్లు ఖర్చు పెడుతున్నారంటే మీ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమేనన్నారు.
- ఎన్నికల హామీలను చంద్రబాబు అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండానే ఎనిమిది మాసాల కాలంలోనే రూ.1.50 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మదనపల్లె పరిశీలకులు హాబీబుల్లా ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హారూన్ బాష, వైఎస్సార్‌సీపీ నాయకులు పడమటి కోన బాబురెడ్డి, కౌన్సిలర్లు గౌస్‌ఖాన్, ఎస్. ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్,రవీంద్ర యాదవ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ చేతికి ప్రయాణప్రాంగణం!

- కోట్ల రూపాయలు విలువచేసే రాయచోటి పాతబస్టాండ్ స్థలం ఆక్రమణకు రంగం సిద్ధం

రాయచోటి: తరతరాలుగా రాయచోటి నియోజకవర్గ ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికులకు సుపరిచితంగా ఉన్న రాయచోటి పాతబస్టాండ్ రాబోయే రోజుల్లో ప్రైవేటు వ్యక్తుల కబంధ హస్తాల్లోకి వెళ్లనుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రాంతాన్ని మూడు విభాగాలుగా విభజించి పంచుకునేలా ప్రణాళికలు కూడా సిద్ధం చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ స్థలం కోసం స్థానికంగా ఉన్న కొంతమంది ప్రైవేటు వ్యక్తులు తప్పుడు రికార్డులు సృష్టించి ఆక్రమణకు ప్రయత్నాలు చేశారు. స్థానిక నాయకులు, అధికారులు వారి ప్రయత్నాలను తిప్పికొడుతూ ఆస్తిని కాపాడుకుంటూ వచ్చారు. అయితే కాలానుగుణంగా వచ్చిన రాజకీయ మార్పులు, అధికారుల్లో లోపించిన నిబద్ధతను ఆక్రమణదారులు సొమ్ము చేసుకునే ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వంలో ఆక్రమణదారులకు అన్ని విధాలుగా అనుకూల వాతావరణం నెలకొన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇది నిజమని, నాలుగు గదుల మధ్య జరుగుతున్న బహిరంగ రహస్య ఒప్పందం పూర్తయిందన్న సమాచారం జిల్లా కేంద్రంలో దావానంలా వ్యాపించింది.పాత బస్టాండ్ ప్రాంగణాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ఆందోళన చేస్తామని నియోజకవర్గ ప్రజలు హెచ్చరిస్తున్నారు.



రాయచోటిలోని పాతబస్టాండ్ ప్రాంతం

పంచాయతీ నుంచి..

రాయచోటి పంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి నాటి అధికారులు, పాలకులు ప్రజల సౌకర్యార్థం సర్వే నంబరు. 784/1లోని 0.28 సెంట్ల భూమిని కొనుగోలు చేసి బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్టాండ్ నుంచే 2010 వరకు బస్సుల రాకపోకలు సాగేవి. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా ఆనాటి ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి హయాంలో పక్కనే ఉన్న క్లబ్‌ను ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి తరలించి ఆ ప్రాంతాన్ని కూడా బస్టాండ్ నిర్వహణకు అనుమతులు ఇప్పించారు. పంచాయతీ మున్సిపాలిటీగా అభివృద్ధి చెందడం, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల బస్సులకు అనుగుణంగా ఉండేలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నాటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పక్కనే ఉన్న 30 సెంట్ల రెవెన్యూ స్థలాన్ని కేటాయించి రూ. 2.5 కోట్లతో భవన సముదాయాన్ని నిర్మింపచేశారు. పాతబస్టాండ్ ప్రాంతాన్ని పూలు, పండ్లు ఇతర చిరు వ్యాపారులకు ఆ స్థలాన్ని కేటాయించారు.

మెప్మా భవనం నిర్మాణం

పాతబస్టాండ్ ప్రాంగణంలో 2008–09 సంవత్సరంలో రూ. 28 లక్షలతో మెప్మా భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. ఈ భవనంలోనే మీసేవ కార్యాలయం కూడా నడుస్తూ వచ్చింది. మిగిలిన ప్రాంగణంలో పూలు, పండ్లు వ్యాపారులు వ్యాపారాలతో జీవనం సాగిస్తున్నారు. దీనిని పంచుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు ప్రచారం జరుగుతుండటంపై స్థానికులు మండిపడుతున్నారు.

కలెక్టర్ ఉత్తర్వులు భేఖాతర్

రాయచోటిలోని 28 సెంట్లలో పాతబస్టాండ్ ప్రాంతాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తిస్తూ 2011లో నాటి కడప జిల్లా కలెక్టర్ కోర్టుకు ఆధారాలతో సంబంధిత పత్రాలను అందజేశారు. నాటి కలెక్టర్ ఆదేశాల ఆధారంగానే 2023లో జిల్లా కలెక్టర్ కూడా ఇది ప్రభుత్వ స్థలమేనని, ఇందులో ఇతరులు జోక్యం చేసుకోవడానికి వీలు లేదని కోర్టుకు తెలియపరిచినట్లు రికార్డులు ఉన్నాయి. వీటన్నింటినీ పక్కన పెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికార దర్పంతో జిల్లా అధికారులను ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

కలెక్టర్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి: శ్రీకాంత్‌రెడ్డి

జిల్లా కలెక్టర్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి కోరారు. ప్రభుత్వ స్థలాలను కాపాడటంలో నిక్కచ్చిగా వ్యవహరించాలన్నారు. పాతబస్టాండ్ స్థల విషయంపై కూడా గత జిల్లా పాలకులు ఇచ్చిన నివేదికలు, సూచనలు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కలెక్టర్ బంగ్లా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా కలెక్టర్ చూడాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

క్లుప్తంగా

40 గ్రాముల బంగారం అపహరణ

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో గురువారం 40 గ్రాముల బంగారం సరుడు అపహరణకు గురైనట్లు ఎస్‌ఐ మంజునాథ్ తెలిపారు. ప్రధాన రహదారిలో ఉన్న నారాయణరెడ్డి ఇంటిలో ఆయన భార్య రాజేశ్వరి ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తి ఇంటి వరండాలోకి వచ్చి ఆమె మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు సరుడును లాక్కొని వెళ్లాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



సంబేపల్లె : మండల పరిధిలోని గంగిరెడ్డి చెరువు వద్ద చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి సమీపంలోని బండపై గుర్తు తెలియని వృద్ధుడి(65) మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ భక్త వత్సలం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

బైకును ఢీకొన్న లారీ



పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి సమీపంలో గురువారం సాయంత్రం మోటారు బైకును లారీ ఢీకొంది. చిన్నంపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రంగనాయకులు పాఠశాల విధులు ముగించుకొని ఇంటికి బైకుపై వెళ్తుండగా తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న లారీ చిన్నంపల్లి-రెడ్డిపల్లి క్రాస్ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో రంగనాయకులు స్వల్ప గాయాలతో బయటపడగా ద్విచక్ర వాహనం పూర్తిగా దెబ్బతింది. సంఘటన స్థలానికి పుల్లంపేట ఎస్‌ఐ మోహన్ కుమార్ గౌడ్ చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

నమ్మితే నట్టేట ముంచేశాడు

- వాహనాలకు ష్యూరిటీ పేరుతో ఘరానా మోసం
- స్టేషన్ చుట్టూ తిరుగుతున్న బాధితులు
- అండగా నిలిచిన సీపీఎం నాయకులు



టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట బాధితులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : బతుకుతెరువు కోసం ట్రాక్టర్ కొనుగోలు చేస్తున్నాను. ష్యూరిటీ పెట్టాలని కోరితే... నమ్మి సంతకాలు చేసినందుకు, ఏకంగా వాహనాలను తమ పేరుమీదే రిజిస్టర్ చేయించి, కంతులు చెల్లించకుండా ఎగ్గొట్టిన ఘరానా మోసగాడి ఉదంతం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని బాధితులే తీసుకువచ్చి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అయితే పోలీసులు మోసగాడికి వత్తాసు పలికి అమాయకులను స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్న వైనాన్ని సీపీఎం నాయకులు తెలుసుకుని బాధితులకు అండగా నిలిచారు. టూటౌన్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతూ, బాధితులకు న్యాయం జరగకపోతే ఆందోళనలకు సిద్ధమని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, బాధితుల కథనం మేరకు.. మదనపల్లె ఎంజీ నగర్‌లో కాపురం ఉంటున్న అంబేద్కర్ 2023లో తాను ట్రాక్టర్ కొంటున్నానని, ష్యూరిటీ సంతకం చేయాలని నమ్మించి రామారావు కాలనీలో కూలి పనులు చేసుకుని జీవిస్తున్న రెడ్డప్పను ట్రాక్టర్ షోరూమ్‌కు తీసుకెళ్లాడు. అయితే రెడ్డప్పకు తెలియకుండా అతని పేరుపై ఫైనాన్స్‌లో ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. తర్వాత కంతులు సక్రమంగా కట్టలేదు. అదే విధంగా పట్టణంలోని గాంధీపురానికి చెందిన శ్రీనివాసులును సైతం ఇదే విధంగా మోసం చేసి, నమ్మించి అతని పేరు మీద ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఏడాది తర్వాత ట్రాక్టర్‌కి సంబంధించిన కంతులు కట్టకపోవడంతో ఫైనాన్సు సిబ్బంది రెడ్డప్ప, శ్రీనివాసులుకు నోటీసులు పంపారు. మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మోసగాడైన అంబేద్కర్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడి కోసం గాలించామని, తమకు దొరకలేదని, మీరు తీసుకువస్తే విచారించి న్యాయం చేస్తామని బాధితులకే చెప్పారు. ఈ క్రమంలో బాధితులు నానా తంటాలు పడి మోసగాడి వివరాలు తెలుసుకొని చిత్తూరు సమీపంలోని ముత్తుకూరులో ఉన్న నిందితుడు అంబేద్కర్‌ను పోలీసుల సహాయంతో స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయితే నిందితుడి తరఫున హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు వకాల్తా పుచ్చుకుని రెండు రోజుల్లో ట్రాక్టర్లను ఫైనాన్స్ కంపెనీకి అప్పజెప్పడమో లేదా కంతులు చెల్లించడమో జరిగేలా చూస్తానని చెప్పి అతన్ని వదిలేశారు. ఏడాది దాటినా తమకు న్యాయం జరగకపోవడంతో బాధితులు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. చివరకు డీఎస్పీ కొండయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఎస్పీ రెండు రోజుల్లో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

లారీ ఢీకొని ఇద్దరి మృతి



మృతి చెందిన వెంకట్రామిరెడ్డి, గంగాధర్

రామసముద్రం : సిమెంట్ లారీ ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన రామసముద్రం మండలంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు మండలం ఏటవాకిలి పంచాయతీ దిగువపల్లికి చెందిన వెంకటరామిరెడ్డి(55), ప్రసన్నయ్యగారిపల్లి గ్రామానికి చెందిన గంగాధర్(45) ఉదయం ద్విచక్ర వాహనంలో కొల్లపారం రోడ్డు నుంచి ఏటవాకిలి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా నాయుడుపేట నుంచి కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపురం వెళ్తున్న సిమెంట్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందగా, వెంకట్రామిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గుర్తించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వెంకట్రామిరెడ్డిని 108 వాహనంలో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. సమాచారం అందుకున్న రామసముద్రం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక ఆచూకీ లభ్యం

– నిందితుడిపై పోక్సో కేసు నమోదు

మదనపల్లె : బాలిక అదృశ్యం కేసులో ఆచూకీ లభ్యమైనట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన ఓ మైనర్ బాలిక(17) ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈనెల 9న కాలేజీకి వెళ్లి తిరిగి రాకపోవడంతో బాలిక తండ్రి తెలిసిన ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు రెడ్డెప్పనాయుడు కాలనీకి చెందిన ఆనంద్ కుమారుడు చరణ్(20) బాలికతో స్నాప్‌చాట్‌లో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి తీసుకు వెళ్లినట్లు గుర్తించారు. దర్యాప్తు చేసిన పోలీసులు, బాలిక కర్ణాటకలో ఉన్నట్లు తెలుసుకుని గురువారం మదనపల్లెకు తీసుకువచ్చారు. వైద్యపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు చరణ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఒంటిమిట్ట రామాలయంలో కూలీకి గాయాలు



గాయపడిన కత్తి రవిబాబు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ పునర్ నిర్మాణ అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం పురావస్తుశాఖ సిబ్బంది పనులు చేయిస్తుండగా కత్తి రవిబాబు అనే కూలీకి తీవ్ర గాయమైంది. బాధితుని వివరాల మేరకు.. సున్నపు గ్రైండర్ ఆన్ చేసేందుకు రవిబాబుతోపాటు ఇద్దరు వ్యక్తులు వెళ్లగా బెల్టు లాగే సమయంలో ప్రమాదవశాత్తు రవిబాబు చేతివేళ్లు చితికిపోయి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే పురావస్తుశాఖ సిబ్బంది బాధితుడిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు



గాయపడిన గంగాధర్

మదనపల్లె : బైక్ అదుపుతప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని గాంధీపురానికి చెందిన గంగాధర్(32) కమ్మీ పనిచేస్తూ జీవిస్తుంటాడు. సాయంత్రం పట్టణంలో నుంచి ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా, మార్గమధ్యంలో కుమారపురం స్పీడ్‌బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయం కాగా, గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

సిద్దవటం : బద్వేలు నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఒక వ్యక్తిని ఢీ కొనడంతో గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం అటవీ శాఖలో ప్రొటెక్షన్ వాచర్‌గా పనిచేస్తున్న రమణారెడ్డి గురువారం రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళుతుండగా బాలసూరయ్య మెడికల్ స్టోర్ వద్దకు రాగానే కడప నుంచి బద్వేలు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణారెడ్డి తలకు గాయాలయ్యాయి. బస్సు ఆగకుండా వెళ్లిపోయింది. గాయపడిన వ్యక్తిని స్థానిక ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.

కోడిపందెం శిబిరంపై దాడి

గాలివీడు : మండల పరిధిలో కోడి పందేలు ఆడుతున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. గొట్టివీడు గ్రామం నగిరిలో కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులతోపాటు రెండు కోడిపుంజులు, రూ. 3500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ



వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి

గాలివీడు : మండలంలోని నూలివీడు, గాలివీడు ఎస్సీ బాలుర వసతి గృహాలను అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికార అధికారి ఎస్.జయప్రకాష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన వసతి గృహంలోని వంటశాల, తాగునీరు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఇష్టపడి చదివి మంచి మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు రవీంద్ర నాయక్, రవీంద్ర బాబు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

నిమ్మనపల్లె : అక్రమంగా ప్రభుత్వ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 43 క్వార్టర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ముష్టూరు పంచాయతీ ఎర్రప్పగారిపల్లెలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో గురువారం సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఎర్రప్పగారిపల్లెకు చెందిన రెడ్డిరాజు(35) మదనపల్లి, నిమ్మనపల్లి, వాల్మీకిపురం తదితర ప్రాంతాలలోని మద్యం షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి, గ్రామంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. రెడ్డిరాజును అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి 43 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వణికిస్తున్న చలి

- కనిష్ట ఉష్ణోగ్రత : 16 డిగ్రీలు
- గరిష్ట ఉష్ణోగ్రత : 36 డిగ్రీలు



పొగమంచు కారణంగా తెల్లారినా లైటుతో నడుస్తున్న రైలు



చలి తీవ్రతను తట్టుకునేందుకు చలిమంట కాచుకుంటున్న ప్రజలు

రాజంపేట టౌన్ : చలి పంజా విసురుతోంది. దీంతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఉదయం 8 గంటల వరకు పొగమంచు ఉంటుండటంతో ప్రజలు చలిని తట్టుకోలేక స్వెటర్, మంకీక్యాప్ వంటి వాటిని ఉపయోగిస్తున్నారు. అయినప్పటికీ చలి నుంచి ఉపశమనం పొందలేక పోతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేసుకునేందుకు పొలాల్లోకి వెళ్లే రైతులు, దినసరి కూలీలు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారు, పట్టణాల్లోని విద్యా సంస్థలకు వచ్చే గ్రామీణ ప్రాంత విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రతను తట్టుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలే కాక పట్టణాల్లోని ప్రజలు సైతం తమకు అనువైన చోట చలిమంట వేసుకొని వెచ్చదనం పొందుతున్నారు.

కప్పేస్తున్న మంచు దుప్పటి

ఉదయం 8 గంటల వరకు మంచు తీవ్రంగా కురుస్తోంది. ఈ కారణంగా వాహనదారులు ఎదురుగా వచ్చే వా హనాలు కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పు ల వల్ల ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు జ్వరం, జలుబు బారిన పడుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో ఆస్తమా, అలర్జీ ఉన్న వారు ఉదయం వేళల్లో బయటకు రాకూడదు. చలి వల్ల వ్యాధి తీవ్రత ఎక్కువ అవుతుంది. చిన్నపిల్లల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఉదయం బయటకు వచ్చేవారు విధిగా స్వెటర్, చెవులు, ముక్కు కప్పే విధంగా మంకీ క్యాప్‌లను ధరించాలి. అలాగే చలికాలం పూర్తయ్యే వరకు కాచి చల్లార్చిన నీళ్లు తాగితే మంచిది – డాక్టర్ మాధవరెడ్డి, ప్రభుత్వ హాస్పిటల్, రాజంపేట

కురుబలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఘనంగా భక్త శ్రేష్ఠ కనకదాసు 537వ జయంతి వేడుకలు



కురుబ ప్రతినిధులను సన్మానిస్తున్న ఏపీ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె : రాష్ట్రంలోని కురుబ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని శ్రీరామతులసీ కల్యాణ మండపంలో శ్రీ భక్త శ్రేష్ఠ కనకదాసు 537వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర కురుబ సంఘ ప్రతినిధులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, కులస్తులు హాజరయ్యారు. తొలుత భక్త కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమలో కురుబల జనాభా రాజకీయాల్లో గెలుపు ఓటములను నిర్ణయించే స్థాయిలో ఉన్నప్పటికీ, రాజకీయంగా కురుబలకు ఆశించిన న్యాయం జరగడం లేదన్నారు. కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ముందుకు రావాలన్నారు. కురుబలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఏప్రిల్ 2న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గం కుప్పం నుంచి యాత్రను ప్రారంభిస్తామన్నారు. 90శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న గొర్రెల రుణాలు కురుబ కులస్తులకే కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మూడోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా జబ్బల శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురుబ యువత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోటి సురేష్(బత్తలపల్లె), యువత అధ్యక్షుడిగా కాటమయ్యను ఎన్నుకున్నారు. కూటమి ప్రభుత్వంలో నూతనంగా పదవులు పొందిన ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వసికెరి కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమిలేపల్లె సచివాలయం మూతపై ఎంపీడీఓ విచారణ

సాక్షి ఎఫెక్ట్..



అమిలేపల్లె గ్రామ సచివాలయంలో ఉద్యోగులను విచారిస్తున్న ఎంపీడీఓ వెంకటేశులు

గుర్రంకొండ : మండలంలోని అమిలేపల్లె, మర్రిమాకులపల్లె గ్రామసచివాలయం మూత పడడంపై ఎంపీడీఓ వెంకటేశులు విచారణ జరిపి నలుగురు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సాక్షిలో గురువారం ప్రచురితమైన 'తెరుచుకోని గ్రామ సచివాలయం' అనే వార్తపై అధికారులు స్పందించారు. ఎంపీడీఓ అమిలేపల్లె గ్రామసచివాలయం చేరుకొని విచారణ జరిపారు. గత బుధవారం ఆరుగురు సచివాలయ ఉద్యోగులు హాజరుకాకపోవడం, బయోమెట్రిక్ వేయక పోవడం లాంటి విషయాలు విచారణలో వెలుగుచూసినట్లు ఎంపీడీఓ తెలిపారు. అందులో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శుల సమావేశానికి హాజరై ఆ తరువాత బయోమెట్రిక్ వేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన మహిళా కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్లు సెలవు పెట్టినా పంచాయతీ కార్యదర్శి అంగీకరించలేదన్నారు. వీఆర్‌ఓ, సర్వేయర్ బయోమెట్రిక్ వేయకపోవడంతో పాటు హాజరు రిజిష్టర్‌లో సంతకాలు కూడా చేయలేదన్నారు. అలాగే వీఆర్‌ఓ, సర్వేయర్లు గురువారం తాను విచారణ జరిపే సమయంలో కూడా సచివాలయంలో అందుబాటులో లేరన్నారు. విచారణ ముగిసిన అనంతరం వీఆర్‌ఓ, సర్వేయర్, మహిళా కార్యదర్శి, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

కోర్టు ఆదేశాలు బే ఖాతర్

సర్వే జరపకుండానే రోడ్డు నిర్మాణం



సర్వే జరపకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని లక్ష్మీ ప్యారడైజ్ ఎదురుగా జాతీయ రహదారి నుంచి పాత బస్టాండ్‌కు వెళ్లే దారిలో కోర్టు ఆదేశాల మేరకు జిల్లా అధికారులు సర్వే జరిపి రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ కూటమి నాయకులకు జీ హుజూర్ అంటూ అధికారులు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. దీనివల్ల నష్టపోతున్నామని స్థల యజమానులు మొత్తుకున్నా పట్టించుకోలేదు. రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థల యజమానులు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని చట్టపరంగా సర్వే జరిపి తాము నష్టపోకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారుల చుట్టూ తిరిగి కోర్టు ఉత్తర్వులను చూపించినా ఫలితం లేదు. స్థల యజమాని ప్రసాద్ మాట్లాడుతూ సర్వే నంబర్ 38లో తమ స్థలం ఉందని అధికారులు, కాంట్రాక్టర్, మరికొందరు దౌర్జన్యంగా రోడ్డు పనులు చేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు.

ఎంపీడీఓ ఏమంటున్నారంటే..

స్థానిక ఎంపీడీఓ నాగార్జున మాట్లాడుతూ ఇదివరకే అక్కడ ప్రభుత్వం మెటల్ రోడ్డు నిర్మించిందన్నారు. దాని ఆధారంగా పంచాయతీ తీర్మానం ప్రకారం రోడ్డు వెడల్పు చేసి నిర్మాణం చేపట్టామన్నారు. అక్కడి స్థల యజమాని అభ్యంతరం తెలపడంతో ప్రస్తుతం రోడ్డు పనులు ఆపేశామన్నారు. ఆ స్థలాన్ని సర్వే జరిపి రోడ్డు హద్దులు నిర్ధారించాక పనులు మొదలు పెడతామని స్పష్టం చేశారు.

లారీ డ్రైవర్‌ను పోలీసులు గాయపరచలేదు



లారీ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్య నాయుడు

మదనపల్లె : పోలీసుల దాడిలో లారీ డ్రైవర్ గాయపడలేదని డీఎస్పీ కొండయ్యనాయుడు, తాలూకా సీఐ కళా వెంకటరమణ లారీ అసోసియేషన్ సభ్యులకు తెలిపారు. గురువారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో లారీ అసోసియేషన్ సభ్యులతో డీఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మంగళవారం రాత్రి తట్టివారిపల్లె బైపాస్ వద్ద వాహనాల తనిఖీలో జార్ఖండ్ డ్రైవర్, లారీకి సంబంధించిన రికార్డులు చూపకపోగా, పరుషంగా మాట్లాడటంతో పోలీసులకు, అతడికి మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. పోలీసులు డ్రైవర్‌పై దాడిచేసి కాలు విరగ్గొట్టారని జిల్లా ఆస్పత్రిలో బాధితుడు చెప్పడం అవాస్తవమన్నారు. ఘటనకు సంబంధించి బాధితుడి కాలు ఎక్స్‌రేను లారీ అసోసియేషన్ సభ్యులకు చూపారు. ఈ విషయంలో డ్రైవర్లు అనవసర రాద్ధాంతం చేశారని, రికార్డులు సక్రమంగా కలిగి, పోలీసులు అడిగినప్పుడు చూపితే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

భూ రీసర్వేను పరిశీలించిన ఆర్డీఓ



గుండ్లమూలలో జరుగుతున్న భూ రీసర్వేను పరిశీలిస్తున్న కడపన ఆర్డీఓ జాన్‌ఇర్విన్

సిద్దవటం : మండలంలోని గుండ్లమూల రెవెన్యూ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా జరుగుతున్న భూ సర్వే కార్యక్రమాన్ని గురువారం కడప ఆర్డీఓ జాన్ఇర్విన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 4వ తేదీ నుంచి ప్రవేశ పెట్టిన భూ రీసర్వే కార్యక్రమంలో రైతులు తప్పనిసరిగా ఉండేటట్లు చూడాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే సర్వే జరిగే చోట నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ భూమి, రైతు పట్టాల భూరీ సర్వే ఎంత విస్తీర్ణం చేశారంటూ ఇన్‌చార్జి మండల తహసీల్దారు మాధవీలతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంప్రోక్షణ మహోత్సవాలకు ఆలయాన్ని సిద్ధం చేయండి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో పురావస్తు శాఖవారు పునర్ నిర్మాణ అభివృద్ధి పనులు చేస్తుండటంతో సంప్రోక్షణ మహోత్సవాల నాటికి పనులను పూర్తి చేయాలని టీటీడీ స్పెషల్ డిప్యూటీ ఈఓ ప్రశాంతి సూచించారు. ఈ ఏడాది మార్చి 5వ తేది నుంచి 10వ తేదీ వరకు నిర్వహించబోయే సీతాలక్ష్మణ సమేత శ్రీరామ మహా కుంభాభిషేకం వేడుకల నాటికి పనులు మొత్తం పూర్తి కావాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సివిల్ విభాగం డీఈ నాగరాజు, ఆలయ డిప్యూటీ ఈఓ నరేష్ బాబు, అర్చకులు శ్రావణ్ కుమార్, కాంట్రాక్టర్ కృష్ణమూర్తి, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇల్లు కూల్చివేత



ఆదిరెడ్డి ఇంటిని కూల్చి వేస్తున్న జేసీబీ

రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయతీ చెరువు ముందరపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదిరెడ్డి ఇంటిని జేసీబీ సాయంతో అధికారులు గురువారం కూల్చి వేశారు. ఎన్నో ఏళ్లుగా తాము ఆ ఇంట్లో నివాసముంటున్నామని, అధికారులు తమకు ఎలాంటి తాఖీదులు ఇవ్వకపోవడంతో ఇంటి నిర్మాణం చేసుకున్నామన్నారు. రాజకీయం కక్ష సాధింపులో భాగంగా తన ఇంటిని అన్యాయంగా కూల్చివేయడం అది కూడా అధికారులు, పోలీసుల సమక్షంలో కూల్చి వేయడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యామన్నారు. ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు అంగన్వాడీ స్కూల్ కాంపౌండ్‌లో అక్రమంగా ఇల్లు నిర్మించారని ఫిర్యాదు చేయడంతో అక్రమ కట్టడాలను తొలగించామని తహసీల్దార్ రామాంజులు, ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.